క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



గ్యాస్ లీకై ఏర్పడిన మంటలు ఆర్పడాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గంగవరం: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలమనేరు అగ్నిమాపక శాఖ అధికారి మనోహరన్ తెలిపారు. ఆయన సోమవారం మదర్‌థెరిసా కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఇళ్లలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించినప్పుడు ఏమి చేయాలన్న దానిపై డెమో ద్వారా ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బొలేరో వాహనం

పుంగనూరు: మండలంలోని చిన్నారికుంట మలుపు వద్ద సోమవారం కారును బొలేరో వాహనం ఢీకొంది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బొలేరో వాహనం పలమనేరు నుంచి పుంగనూరు వస్తోంది. అదే సమయంలో కారు పుంగనూరు నుంచి పలమనేరు వైపు వెళుతోంది. చిన్నారికుంట మలుపు వద్ద బొలేరో వాహనం కారును ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న భాగ్యవతి (32) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇతర ప్రాంతాల్లోని పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని హెచ్‌ఎం ఫజురుల్లా తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, మునిరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్

పలమనేరు: బీజేపీ జిల్లా కార్యదర్శిగా పలమనేరుకు చెందిన ప్రభాకర్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన అధిష్టానానికి కట్టుబడి ఉంటానని, జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రభాకర్ తెలిపారు. ఆయనను స్థానిక బీజేపీ నేతలు అభినందించారు. ఇందులో ఉమామహేష్, వెంకటాద్రి, మనోహర్, ఆంజినేయులు, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవు



పలమనేరులోని ఓ దుకాణం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. యూరియాకు కృత్రిమ డిమాండ్ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మూడు రోజుల క్రితం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇప్పటికే జిల్లాలోని రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేశామన్నారు. హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ డీలర్లకు ట్రాన్స్‌పోర్ట్ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీన్ని సాకుగా చూపి ఎవరైనా కాంప్లెక్స్ ఎరువు కొంటేనే యూరియా ఇస్తామని డిమాండ్ చేస్తే ఏవోలకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యాపారులు వ్యవహరిస్తే ఎఫ్‌సీవో నిబంధనల ప్రకారం లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు యూరియాను పశుగ్రాసానికి వాడుతున్నారని, ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. యూరియాతో పెరిగిన గడ్డి తిన్న ఆవులు ఇచ్చే పాలు విషతుల్యమవుతాయని వెల్లడించారు. ఆవుల మేతకు సేంద్రీయ ఎరువులను మాత్రమే వాడాలని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించాలని ఏవోలను ఆదేశించినట్లు తెలిపారు. ఇలా ఉండగా జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతూనే ఉండడం కొసమెరుపు.

రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్టు



సదుంలో నిరసన తెలుపుతున్న శ్రేణులు



సోమల: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

పులిచెర్ల(కల్లూరు): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. వారు సోమవారం 106 రామిరెడ్డి గారిపల్లెలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు చర్యలకు పాల్పడుతోందని, లిక్కర్ స్కాంలో సంబంధం లేకపోయినా మిథున్ రెడ్డిని ఇరికించి అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఇందుకు త్వరలో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదముని రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్‌బాషా, రెడ్డి అహమ్మద్, నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రాయల్ మోహన్, నాగరాజ ప్రసాద్, అశోక్, గోవిందరెడ్డి, ఆనంద, ఎస్‌వీ రమణ, శివ, శ్రీనివాసులు రెడ్డి, కలాం, శివారెడ్డి, మధు, కేశవులు రెడ్డి, నారాయణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి : మురళీమోహన్‌రెడ్డి



చంద్రబాబు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ప్రజల్లో విశేషఆదరణ వస్తోందన్నారు. దాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి నాయకులను జైలుపాలు చేస్తున్నట్టు విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై చేసిన ఆరోపణల్లో ఒక్కదాన్ని కూడా నిరూపించలేకపోయారని తెలిపారు. మద్యం కేసులో మిథున్‌రెడ్డికి సంబంధం లేకపోయినా అరెస్టు చేశారని, ఆయన మచ్చలేని వ్యక్తిగా బయటకు వస్తాడని తెలిపారు.

అక్రమ కేసులతో భయపెట్టలేరు

సదుం: అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టలేరని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రామాపురంలోని అంబేడ్కర్ విగ్రహం నిరసన తెలిపారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం కాకుండా అంబేడ్కర్ రాజ్యాంగం అమలయ్యేలా చూడాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి గత ఎన్నికల్లో చంద్రబాబును ఓటమి అంచుకు తీసుకువెళ్లారని తెలిపారు. అందువల్లే చంద్రబాబు నాయుడు వారిపై కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో బలమైన నేతలను వేధించి భయభ్రాంతులకు గురిచేస్తే తాము బలపడవచ్చని కూటమి నేతలు భావిస్తున్నారని విమర్శించారు. అది ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు వెంకటస్వామి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చడానికే మిథున్‌రెడ్డి అరెస్టు

కుప్పం: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గమని కుప్పానికి చెందిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తెలిపారు. వారు సోమవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. లిక్కర్ స్కామ్ ఒక అభూత కల్పన అని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోందని దుయ్యబట్టారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని హితవుపలికారు. ఏ తప్పూ చేయని ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మునిరాజ్, మోహన్‌రామ్, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



పుంగనూరులో నిరసన తెలుపుతున్న నాగభూషణం, కృష్ణమూర్తి తదితరులు

పెద్దిరెడ్డిపై కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్టు

రొంపిచెర్ల: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై వున్న కక్షతోనే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని చంద్రబాబు అరెస్టు చేయించారని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చిచ్చిలివారిపల్లెలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివాదాల జోలికి వెళ్లకుండా, తన నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎంపీ మిథున్‌రెడ్డి పనిచేసుకుంటూ పోతున్నారని తెలిపారు. ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేక సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించారని దుయ్యబట్టారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, మండల కన్వీనర్ కరీముల్లా, నాయకులు విజయశేఖర్, సురేంద్రనాయుడు, కె.రవీంద్రనాథరెడ్డి, గురు, మహబుబ్‌బాషా, సుధాకర్ రెడ్డి, శ్రీనాథనాయుడు, బావాజాన్, ఓబులేసు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసన

సోమల(చౌడేపల్లె): ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. వారు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కందూరులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతోందన్నారు. హామీలు అమలులో ఘోరంగా విఫలమైందని, దీన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను అణచివేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ భీష్మ, నాయకులు మోహన్, కిరణ్‌కుమార్, రాజు, హరి, వినోద్, మనోజ్, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాజకీయ కక్షలో భాగమే..: పీఎస్ నాగరాజు



వి.కోట: రాజకీయ కక్షలో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అని, వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులను బనాయించి అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ఆరోపించారు. ఆయన సోమవారం వి.కోటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వివాద రహితుడిగా, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం స్కాంలో ఇరికించడం దారుణమన్నారు. అనామకుడు చేసిన ఫిర్యాదుపై సిట్ ఏర్పాటుచేసి తప్పుడు కేసుల్లో వైఎస్సార్ సీపీలోని ముఖ్య నేతలను పథకం ప్రకారం ఇరికిస్తున్నారని దుయ్యబట్టారు. రూ.4 వేల కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపిస్తున్న ప్రభుత్వం అందుకు ఆధారాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై రాజకీయ దురుద్దేశంతోనే వేధింపులకు పాల్పడుతున్నట్టు విమర్శించారు. తమ నాయకుడు కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై పోస్టర్లతో ప్రచారం

పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసు బనాయించి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు. పోస్టర్లను ప్రజలకు అందజేస్తూ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, నాయకులు రహీంఖాన్, శ్యామ్, శ్యామ్‌సుందర్‌రాజు, హేమంత్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే..



సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. తప్పుడు కేసులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రతి రెండు నెలలకొకసారి ఏదో ఒక అంశాన్ని ఎల్లో మీడియా ద్వారా తెరపైకి తీసుకువచ్చి వైఎస్సార్ సీపీ నేతలపై కేసులు పెడుతున్నారు. తద్వారా ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారు.

–జి.నాగభూషణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, చౌడేపల్లె

అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యం ఖూనీ



రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడితప్పింది. పారదర్శకంగా జరిగిన మద్యం విధానాన్ని కుంభకోణంగా చిత్రీకరించి వైఎస్సార్ సీపీ నేతలను అరెస్టు చేస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ శ్రేణుల మనోధైర్యాన్ని తగ్గించలేరు. నిత్యం ప్రజలతోనే ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటాం. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తూనే ఉంటాం. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

–సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, చౌడేపల్లె



పులిచెర్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కుప్పంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు





రొంపిచెర్ల: నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, పలమనేరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

భూ సమస్య పరిష్కరించాలని ధర్నా



బైరెడ్డిపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

బైరెడ్డిపల్లె: తమ భూమిని ఇతరులు ఆక్రమించుకుని రెవెన్యూ అధికారుల సహాయంతో రికార్డుల్లో నమోదు చేసుకుని పట్టాదారు పాసుపుస్తకాలు చేసుకున్నారని దేవదొడ్డి గ్రామస్తులు ఆరోపించారు. వారు సోమవారం మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆద్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ దేవదొడ్డి గ్రామానికి చెందిన బాషాసాబ్‌కు అదే గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 213–1బి2లో 1.46 ఎకరాలు, 213–1బి4లో 1.19 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో 1.19 ఎకరాలను గుంతకుర్రపల్లెకు చెందిన చంద్రశేఖర్‌కు విక్రయించారని తెలిపారు. అతను రెవెన్యూ అధికారులను లోబరుచుకుని మిగిలిన భూమికి కూడా పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకున్నాడని తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, నారాయణశెట్టి, శివకుమార్, ఆనంద, అమానుల్లా, సర్దార్, మునస్వామి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు ఇప్పుడెలా పెడతారు

పలమనేరు: గతంలో స్మార్ట్ మీటర్లు వద్దని అభ్యంతరం తెలిపిన చంద్రబాబు ఇప్పుడు ఎలా ఏర్పాటు చేస్తున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, రాష్ట్ర నాయకుడు సుబ్బారావు విమర్శించారు. పలమనేరులో సోమవారం పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలని లోకేష్ పిలుపునిచ్చారని తెలిపారు. ఇప్పుడు అదే కూటమి నేతలు వీటిని ఏర్పాటుచేసి ప్రజలపై భారం మోపడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అదేవిధంగా తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు సామాన్యుల రక్తాన్ని తోడేస్తున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్ మీటర్ల రద్దుపై వచ్చే నెల 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు వెల్లడించారు. నాయకులు సురేంద్రన్, ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్త, షకీల పాల్గొన్నారు.

నేటి నుంచి పీ-4పై వార్డు సభలు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో మంగళవారం నుంచి 24వ తేదీ వరకు పీ-4 హౌస్ హోల్డ్ సర్వేపై వార్డు సభలు నిర్వహించనున్నట్టు కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కాకాతోపు, రంగాపురం, బజారువీధి, ఎద్దులసంత వీధి 23న ఆర్‌కే స్ట్రీట్, గంటావూరు, పాతపేట, రాజీవ్‌గాంధీనగర్, 24న పాతపేట-1, కొత్తపేట, టీఎస్ అగ్రహారంలో సభలు జరుగుతాయని తెలిపారు.

ఎస్టీవోపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

పలమనేరు: ఇటీవల పలమనేరు ఎస్టీవోగా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్ అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని స్థానిక ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనర్లు సోమవారం జిల్లా, రాష్ట్ర ఖజానా అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ట్రెజరీలో బిల్లులు పాస్ కావాలంటే మామూళ్లు ఇవ్వాల్సిందేనని తెలిపారు. పెన్షన్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ ప్రాసెస్‌కు రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన వారికి సంపాదిత, ఆర్జిత సెలవు బిల్లులు మంజూరు కోసం ఒక శాతం కమీషన్ ఇవ్వాలని మెలిక పెట్టారని ఆరోపించారు. ఆదాయ పన్ను ఈ ఫైలింగ్‌లో ఫారం 16 వ్యక్తిగతంగా ఆఫీసుకెళ్లి తీసుకోవాల్సి ఉంటుందని, ఎస్టీవో ఒక సంఘం నాయకుడికి ఇచ్చి ఒక్కొక్కరి నుంచి రూ.500 వసూలు చేశారని ఆరోపించారు. ఎస్టీవో అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పలువురు నియోజకవర్గ నేతలు సోమవారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం రాత్రి తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు దయానందగౌడ, చెంగారెడ్డి, ప్రహ్లాద, తమీం, చలపతి రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



రొంపిచెర్ల : బహుమతులు అందజేస్తున్న రమేష్

రొంపిచెర్ల: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఆయన సోమవారం తన తండ్రి చట్నా నారాయణ వర్ధంతి సందర్భంగా రొంపిచెర్ల బాలురు, బాలికలు, తెలుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇక్కడే చదువుకున్నానని తెలిపారు. ఈ క్రమంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు తన తండ్రి చట్నా నారాయణ జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. సురేష్, లక్ష్మన్న, హెచ్‌ఎం ధనలక్ష్మీ, అమర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నపన తిరుమంజనం

పుంగనూరు: పట్టణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీవారికి స్నపన తిరుమంజనాన్ని వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, కొబ్బరి నీళ్లు, తేనె, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను మండపంలో కొలువుదీర్చి తులసిమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పుంగనూరు దూడలకు పెరుగుతున్న డిమాండ్

- జత దూడలు రూ.5 లక్షలు పలికిన వైనం
- వీటిని పెంచి విక్రయిస్తున్న రైతులు

పలమనేరు: పుంగనూరు దూడలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇవి అడుగు నుంచి మూడు అడుగులు మాత్రమే పెరుగుతాయి. ఫస్ట్ క్వాలిటీ పొట్టిరకం దూడలు రూ.4 లక్షల వరకు పలుకుతున్నాయి. నియోజకవర్గంలోని గంగవరం మండలం మారేడుపల్లికి చెందించిన గుర్రం మణి సంరక్షిస్తున్న రెండు పుంగనూరు రకం పెయ్య, కుర్ర దూడలను బెంగళూరుకు చెందిన దంపతులు ఆదివారం రూ.5 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇప్పుడు ఈ విషయం స్థానికంగా హల్ చల్‌గా మారింది.

ఇంట్లో ఉంటే అదృష్టమట

లక్షల్లో ధరలున్నా ఇవి పెద్దగా దొరకడం లేదు. తోక నేలకు తగలడం, గోపురం కింద గంగడోలు కిందకి ఉండే ఈ పుంగనూరు జాతి దూడలు ఇంట్లో ఇంటే ఆరోగ్యంతో పాటు అదృష్టం వరిస్తుందనే మాట వినిపిస్తోంది. ఇవి ప్రపంచంలో అరుదైన జాతికి చెందినవి. ఈ దూడలు 15 నుంచి 50 సెం.మీ మాత్రమే ఎత్తు కలిగి వుంటాయి. తక్కువ మేత తీసుకుంటాయి. ఎక్కువ రోగ నిరోధక శక్తిని కలిగి వుంటాయి. ఇవి కుటుంబ సభ్యులపై అత్యంత విశ్వాసాన్ని చూపుతాయి. పేరు పెట్టి పిలిస్తే స్పందిస్తాయి. ఇంటిలో మనుషుల్లా మసలుకుంటాయి. ఈ క్రమంలో వీటిని కొనేందుకు పొరుగు రాష్ట్రాల వారు సైతం పోటీ పడుతున్నారు.



రూ.5 లక్షలు పలికిన పుంగనూరు పొట్టి రకం దూడలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుంగనూరు పొట్టి దూడలు

ఇప్పుడు ఇదో మంచి వ్యాపారం

పలమనేరు సమీపంలోని పశుపరిశోధన కేంద్రంలో పుంగనూరు పొట్టిరకం దూడలు 80 దాకా ఉన్నాయి. వీటి సంతతిని పెంచేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. కొందరు రైతులు పుంగనూరు పొట్టిరకం దూడలను విక్రయం వ్యాపారంలా మార్చుకున్నారు. స్థానికంగా కేటిల్‌ఫామ్, చిన్నపేట కురప్పల్లి, మారేడుపల్లి, పెద్దపంజాణి, పుంగనూరులో పుంగనూరు రకం పొట్టి దూడలను కొందరు రైతులు ఇంటి వద్ద పెంచి ఇతరులకు విక్రయిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పొట్టిరకం దూడల వ్యాపారాలు ఊపందుకోవడం కొసమెరుపు.

ధర లక్షల్లో..

ప్రపంచంలోనే అరుదైన రకం పశువులుగా పుంగనూరు పొట్టి పశువులకు పేరుంది. వీటి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో వీటిని మరింతగా ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఆర్‌కేవీవై ద్వారా కృషిచేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఇలాంటి పశువులు 700 దాకా ఉన్నాయి. ఇందులో 277 వరకు పలమనేరులోని పశు పరిశోధనా కేంద్రంలోనే ఉన్నాయి. అధిక వ్యాధి నిరోధక శక్తి, తక్కువ మేతతో ఎక్కువ వెన్నశాతం కలిగిన పాలని ఇస్తాయి. వీటి పాలు, మూత్రంలో ఔషధ గుణాలు మెండుగా ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది. ఈ దూడలు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పలుకుతున్నాయి.

అంగన్‌వాడీల నిరసన

పుంగనూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం రాంపల్లె వద్దనున్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంచిన పని గంటలను తగ్గించాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.